

అసోంలో ఆర్మీ జవాన్ మృతి
అసోంలో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్న మదారిగూడేనికి చెందిన మహేష్(24) అనారోగ్యంతో మృతిచెందాడు. - 10లో



మోటార్ తీసేందుకు వెళ్లి..
బావిలో మోటారు తీసేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘట గుడిబండలో చోటుచేసుకుంది. - 10లో



బీజేపీలో విలీనమవుతుంది
బీఆర్‌ఎస్ పార్టీ.. త్వరలో బీజేపీలో విలీన మవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న జిల్లా అధికారి నాగయ్య

చివ్వెంల: ఆయిల్ పామ్ తోటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగయ్య అన్నారు. ఆయిల్‌పామమ్ సాగుపై శుక్రవారం చివ్వెంల మండలం జి.తిర్మలగిరి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక ఆదాయం వస్తుందని, ప్రభుత్వం కూడా రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ తోటల్లో అంతర్ పంటలను కూడా సాగు చేసుకోవచ్చాని సూచించారు. సదస్సులో ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారి కన్నా జగన్, ఏఈఓ పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యారాధనలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నిత్యారాధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్ల వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. తర్వాత కల్యాణతంతు నిర్వహించి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి ఒక్కపైసా కూడా నిధులు కేటాయించకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సూర్యాపేటలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమం మరిచిపోయిందన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలో ఉన్న హమాలీ కార్మికుల సంక్షేమం, వైద్య రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాల విషయాన్ని బడ్జెట్‌లో చూపకపోవడం దారుణమన్నారు. జిల్లాకో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని, పంచాయతీ కార్మికులకు ప్రతినెలా వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేసి నేరుగా వారి అకౌంట్‌లోకి వేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, సభ్యులు సాయికుమార్, ఎల్లయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరాడుదాం

ఆత్మకూర్(ఎస్): ఎస్సీ వర్గీకరణ సాధనకు కలిసికట్టుగా పోరాడుదామని మహాజన సంఘర్షణ పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ అన్నారు. ఆత్మకూరు మండలం రామన్నగూడెంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణమాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘం 30వ ఆవిర్భావ వేడుకల్లో రాజన్న మాట్లాడారు. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు బత్తుల వెంకటరాములు మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు, మండల అధికార ప్రతినిధి మిర్యాల చిన్ని, నాయకులు పాల్వాయి వెంకటేష్, పత్తేపురపు మహేష్, కోట ఎలేందర్, బత్తుల దుర్గాప్రసాద్, పవన్, నరేందర్, జలగం వెంకయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజన్నమాదిగ

సామాజిక, ఆర్థిక అంశాల్లో మనం భేష్!



సోషియో, ఎకనమిక్ సర్వే గణాంకాల్లో మన మూడు జిల్లాలది ప్రత్యేక స్థానం

- తలసరి ఆదాయంలో యాదాద్రి జిల్లా టాప్
- సగటున ఒక్కో వ్యక్తికి ఏటా రూ.2.67 లక్షల ఆదాయం
- ఉపాధి హామీలో మనమే ముందంజ.. మూడు జిల్లాల్లోనూ భారీగానే పనులు
- హైదరాబాద్, రంగారెడ్డి తర్వాత నల్లగొండలోనే ఎక్కువ పాఠశాలలు
- స్థూల జిల్లా ఉత్పత్తిలో ఐదో స్థానంలో నల్లగొండ.. సూర్యాపేటకు 9, యాదాద్రికి 13వ ర్యాంకు



సామాజికంగా, ఆర్థికంగా మన మూడు జిల్లాలు ప్రత్యేకతను చాటుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోటీ పడుతున్నాయి. ఈ మేరకు మూడు జిల్లాల వాస్తవ గణాంకాలను సామాజిక, ఆర్థిక సర్వే-2024 వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం వార్షికబడ్జెట్‌తో పాటు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం తలసరి ఆదాయంలో నల్లగొండ, సూర్యాపేట కంటే యాదాద్రి జిల్లా మెరుగ్గా ఉంది. స్థూల జిల్లా ఉత్పత్తిలో రాష్ట్రంలోనే నల్లగొండ ఐదో స్థానంలో ఉండగా, ఆ తర్వాత సూర్యాపేట, యాదాద్రి జిల్లాలున్నాయి. పాఠశాలల విషయంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తర్వాత నల్లగొండ మూడో స్థానంలో నిలవడం గమనార్హం. సామాజిక, ఆర్థిక సర్వే-2024 ప్రకారం పలు అంశాల్లో ఉమ్మడి జిల్లా పరిస్థితి ఇదీ..

-సాక్షి ప్రతినిధి, నల్లగొండ

స్థూల జిల్లా ఉత్పత్తిలో అగ్రభాగాన నల్లగొండ

జీడీడీపీ
- నల్లగొండ - రూ.50,616 కోట్లు
- సూర్యాపేట - రూ.30,003 కోట్లు
- యాదాద్రి- రూ.24,611 కోట్లు

స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విషయంలో యాదాద్రి, సూర్యాపేట జిల్లాలతో పోలిస్తే నల్లగొండ చాలా ముందుంది. నల్లగొండలో జీడీడీపీ రూ.50,616 కోట్లుగా నమోదైంది. సూర్యాపేటలో రూ.30,003 కోట్లు, యాదాద్రిలో రూ.24,611 కోట్లు ఉంది. రాష్ట్ర వ్యాప్త గణాంకాలను పరిశీలిస్తే ఐదో స్థానంలో నల్లగొండ, తొమ్మిదో స్థానంలో సూర్యాపేట, 13వ స్థానంలో యాదాద్రి జిల్లాలున్నాయి.

వ్యవసాయ కనెక్షన్లు భారీగానే..

నల్లగొండ	28.6 శాతం
సూర్యాపేట	28.4 శాతం
యాదాద్రి	26.3 శాతం




రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే మన మూడు జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగానే ఉన్నట్టు సామాజిక, ఆర్థిక సర్వే వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం నల్లగొండ జిల్లాలో ఉన్న మొత్తం విద్యుత్ కనెక్షన్లలో 28.6 శాతం వ్యవసాయ విద్యుత్వే. ఆ తర్వాత పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు 11.2 శాతం ఉండగా, గృహ విద్యుత్ కనెక్షన్లు 60.2 శాతం ఉన్నాయి. సూర్యాపేట జిల్లా విషయానికి వస్తే వ్యవసాయ కనెక్షన్లు 28.4 శాతం, పారిశ్రామిక విద్యుత్ వినియోగం 10.5 శాతం, గృహ వినియోగదారులు 61.1 శాతం ఉన్నారు. యాదాద్రి భువనగిరిలోనూ 26.3 శాతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ పారిశ్రామిక కనెక్షన్లు 11.8 శాతం ఉండగా, గృహ వినియోగ కనెక్షన్లు 61.9 శాతం ఉన్నాయి. ఈ మూడు జిల్లాల్లో చూసుకుంటే గృహ వినియోగం భువనగిరిలో, వ్యవసాయ వినియోగం నల్లగొండలో, పారిశ్రామిక వినియోగం కూడా భువనగిరిలో ఎక్కువగా ఉండడం గమనార్హం.

మెరుగ్గా ఉపాధి హామీ

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో పనిదినాల కల్పనా శాతంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఆ ఏడాదిలో భువనగిరి జిల్లాలో 33.4లక్షల పనిదినాలను కల్పించారు. వాస్తవానికి, నిర్దేశిత లక్ష్యం కంటే 31శాతం ఎక్కువగా పనిదినాలను కల్పించడం గమనార్హం. ఉపాధి హామీ పనిదినాల కల్పన విషయానికి వస్తే నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 77.3లక్షల పనిదినాలను ఆ ఏడాదిలో కల్పించారు. సూర్యాపేట జిల్లాలో 58.2లక్షల పనిదినాలు కల్పించారు. ఈ రెండు జిల్లాల్లోనూ నిర్దేశించుకున్న లక్ష్యం కంటే ఎక్కువగానే పనిదినాలు కల్పించడం విశేషం.

పనిదినాలు	
నల్లగొండ	77.3 లక్షలు
సూర్యాపేట	58.2 లక్షలు
యాదాద్రి	33.4 లక్షలు



తలసరి ఆదాయంలో ఈసారి.. యాదాద్రి

తలసరి ఆదాయం (పీసీఐ) విషయంలో నల్లగొండ కంటే స్వల్పంగా ఎక్కువ ఉన్న యాదాద్రి ముందు వరుసలో నిలిచింది. యాదాద్రి జిల్లాలో సగటున ప్రతి వ్యక్తి ఆదాయం రూ.2,67,605, నల్లగొండలో రూ.2,62,330, సూర్యాపేటలో రూ.2,31,041గా నమోదైంది. ఈ కేటగిరీలో రాష్ట్రంలో ఆరో స్థానంలో యాదాద్రి , ఎనిమిదో స్థానంలో నల్లగొండ, 14వ స్థానంలో సూర్యాపేట ఉన్నాయి. తలసరి ఆదాయం రూ.9,46,862తో రంగారెడ్డి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రూ. 1,80,241తో వికారాబాద్ అట్టడుగున ఉండడం గమనార్హం.

రోడ్లలో 10,14,15 ర్యాంకులు

రహదారుల విషయానికి వస్తే యాదాద్రిలో ప్రతి 100 చదరపు కిలోమీటర్లకు 114 కిలోమీటర్లు, సూర్యాపేట జిల్లాలో 107.1 కిలోమీటర్లు, నల్లగొండ జిల్లాలో 105.3 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. ఈ విషయంలో యాదాద్రి పదో స్థానంలో సూర్యాపేట 14, నల్లగొండ 15వ స్థానంలో ఉన్నాయి. హైదరాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా, ములుగు చివరి స్థానంలో ఉంది.


ఆ రెండింటి తర్వాత..

రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నల్లగొండకు ప్రత్యేక స్థానం ఉందని సామాజిక, ఆర్థిక సర్వే వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తర్వాత అన్ని రకాల యాజమాన్యాలలోని పాఠశాలల సంఖ్య నల్లగొండలోనే ఎక్కువ కావడం విశేషం. హైదరాబాద్‌లో అన్ని రకాల పాఠశాలలు కలిపి 2,840 ఉంటే, రంగారెడ్డిలో 2,824 ఉన్నాయి. ఆ తర్వాత నల్లగొండలోనే అత్యధికంగా 2,004 పాఠశాలలుండడం గమనార్హం. నల్లగొండ తర్వాత మేడ్చల్ (1,998), సంగారెడ్డి (1,764), నిజామాబాద్ (1,725), భద్రాద్రి (1,633), ఖమ్మం (1,598) ఉన్నాయి. ఇక, యాదాద్రి భువనగిరిలో 902, సూర్యాపేటలో 1,264 పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విషయానికి వస్తే నల్లగొండలో 1,483, సూర్యాపేటలో 950, యాదాద్రిలో 712 పాఠశాలలున్నాయి.

అన్ని రకాల పాఠశాలలు	
నల్లగొండ	2,004
సూర్యాపేట	1,264
యాదాద్రి	902



ఆయకట్టులో ఆశలు సజీవం



- శ్రీశైలంలో విద్యుదుత్పాదనతో సాగర్ వైపు కదిలిన కృష్ణమ్మ
- ఆగస్టులో కాల్వలకు నీటిని విడుదల చేసే అవకాశం

ఎడమ కాల్వకు నీటి విడుదల ఇలా..

సంవత్సరం	తేదీ	సంవత్సరం	తేదీ
2013	ఆగస్టు 2	2018	ఆగస్టు 24
2014	ఆగస్టు 6	2019	ఆగస్టు 12
2015	అక్టోబర్ 17	2020	ఆగస్టు 8
2016	ఆగస్టు 24	2021	ఆగస్టు 2
2017	అక్టోబర్ 31	2022	ఆగస్టు 28

నాగార్జునసాగర్: సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది జలకళను సంతరించుకుంది. సాగర్ ఎగువనగల జలాశయాలైన ఆలమ్మటి, తుంగభద్ర నుంచి శ్రీశైలానికి వరద వస్తోంది. శ్రీశైలం గరిష్ట నీటిమట్టం 885.00అడుగులు (215.807 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 860.40 అడుగులుగా (107.1940 టీఎంసీలు) ఉంది. ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం గంటగంటకూ పెరుగుతోంది. వరద ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉంటుందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. శ్రీశైలం జలాశయం కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల నుంచి మొత్తం 57 వేల క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదలవుతున్నాయి.

ఈ సారి జూలైలోనే వరద..

సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 505.10 అడుగులు (123.5012 టీఎంసీలు)గా ఉంది. శ్రీశైలం నుంచి నీరు వస్తుండడంతో నీటిమట్టం స్వల్పంగా పెరుగుతోంది. ఈ ఏడాది జూలై నెలలోనే వరద ప్రారంభం కావడంతో నాగార్జునసాగర్ జలాశయంతో పాటు పులిచింతల జలాశయం కూడా పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఎక్కువసార్లు ఆగస్టులోనే కాల్వకు నీరు

గతేడాది వర్షాభావంతో సాగర్ జలాశయంలోకి నీరు చేరక ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేదు. పది రోజుల క్రితం వరకు కృష్ణానదిలో వరద పెద్దగా లేకపోవడంతో ఈ యేడాది కూడా నీరు రాదేమోనని రైతుల ఆందోళన చెందారు. ప్రస్తుతం వరద ఆశాజనకంగా ఉండడంతో సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశముంది. దీంతో రైతులు కొందరు నార్లు పోసుకుంటున్నారు. గతంలో ఎక్కువ సార్లు ఆగస్టు మాసంలోనే ఆయకట్టుకు నీటి విడుదల చేశారు. ఇప్పుడు వరద భారీగా వస్తే ముందస్తుగానే నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆగస్టు 11న కళాకారుల ఆత్మీయ సమ్మేళనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తెలంగాణ కళావేదిక ప్రతినిధులు, నాయకులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆగస్టు 11న ఉద్యమ కళాకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్ తెలిపారు. శుక్రవారం ఉద్యమ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎర్ర అనుదీప్ మాట్లాడుతూ తెలంగాణ కోసం ఆడి పాడిన కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలన్నారు. అలాగే 250 చదరపు గజాల్లో ఇల్లు కట్టించి ఇవ్వాలని, వృద్ధ కళాకారులకు రూ.10వేల పెన్షన్, హెల్త్‌కార్డులు, ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు మందుల సామేల్, ఉత్తమ్ పద్మావతి, వేముల వీరేశం, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, తెలంగాణ కళావేదిక రాష్ట్ర కార్యదర్శి జువ్వాజి ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు శైలేందర్, మహిళా అధ్యక్షురాలు జూలూరి అంబిక, నాయకులు సంతోష, పందిరి సైదులు, కోడి భీమ్‌ప్రసాద్, గంట నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలు జ్యోతుల ప్రీతి, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణి ఆపరేటర్ దందా

- భూమి భాగాల పంపిణీకి రూ.50 వేలు డిమాండ్
- డబ్బులు ఇవ్వలేదని పాస్ పుస్తకాలు అప్పగించకుండా వేధింపులు
- వైరల్‌గా మారిన ఫోన్‌కాల్ రికార్డింగ్
- కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో బయటపడిన అవినీతి బాగోతం



కోదాడ తహసీల్దార్ కార్యాలయం

కోదాడ: కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ధరణి ఆపరేటర్.. రైతుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నాడు. పనులు జరగాలంటే ఉన్నతాధికారులకు డబ్బులు ఇవ్వాలని రైతుల నుంచి రూ.వేలకు వేలు లంచం డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని రైతులను మాత్రం నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లంచం ఇవ్వలేదని బాధిత రైతులకు ఫోన్ చేసి డిమాండ్ చేయడం, సదరు ధరణి ఆపరేటర్ మాట్లాడిన మాటలు ఫోన్‌లో రికార్డు కావడం, ఆ ఆడియో కోదాడలో వైరల్‌గా మారింది. ఈ లంచగొండి ఆపరేటర్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు తీసుకుండా కేవలం మందలించి వదిలేయడం గమనార్హం. గతంలో కోదాడలో పనిచేసిన ఈ ఉద్యోగి అవినీతి పరకాష్టకు చేరడంతో నడిగూడేనికి బదిలీ చేశారు. పైరవీతో మళ్లీ కోదాడకు వచ్చి దందా సాగిస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.

అసలు విషయం ఏమిటంటే..

కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన రైతు తన కున్న భూమిని తన కుమార్తె, కుమారుడికి భాగాల పంపిణీ చేయాలనుకున్నాడు. దీనికోసం సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన రైతు కుమారుడు కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి విభాగంలో పనిచేస్తున్న ఆపరేటర్‌ను సంప్రదించాడు. పని రిస్క్‌తో కూడుకున్నదని.. అయినా చేసిపెడతాను.. ఇందుకు పైఅధికారులకు ఇవ్వాలని రూ.50 వేలు డిమాండ్ చేసి.. చివరకు రూ.30 వేలకు బేరం కుదుర్చుకున్నట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు. రిజిస్ట్రేషన్ సమయంలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో విషయం తెలుసుకున్న రైతు మన భూమి మనకు చేయడానికి డబ్బులు ఎందుకివ్వాలని కొడుకును తిట్టి డబ్బులు ఇవ్వకుండా వచ్చేశారు.

ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్

ధరణి ఆపరేటర్ మరుసటి రోజు నుంచి హైదరాబాద్‌లో ఉన్న రైతు కొడుకుకు ఫోన్ చేసి ఇచ్చిన కమిట్‌మెంట్ ప్రకారం డబ్బులు ఇవ్వాలని, మీరు ఇవ్వకపోతే పైఅధికారులకు నా జేబులోనుంచి తీసి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పుకొచ్చాడు. ధరణి ఆపరేటర్ ఫోన్‌లో డబ్బులు డిమాండ్ చేసిన విషయాన్ని రికార్డు చేసి కోదాడలో వైరల్ చేయడంతో అది పట్టణంలో చర్చనీయాంశమైంది. డబ్బులు ఇవ్వలేదని భాగాల పంపిణీ చేసిన తరువాత పాత పట్టదారు పాసుపుస్తకం, భాగాల పంపిణీ పత్రాలు ఇవ్వకుండా తన వద్దే పెట్టుకున్నాడని, డబ్బులు ఇచ్చి అవి తీసుకెళ్లాలని ఇబ్బంది పెడుతున్నాడని బాధితులు వాపోతున్నారు. అంతే కాకుండా సమీపంలోని మీసేవ కేంద్రం నిర్వాహకులతోనే అన్నిరకాల డీల్స్ మాట్లాడుతున్నాడని, ఆయనకు చెప్పిన తరువాతే ఆ కేంద్రం వారు స్లాట్ బుక్ చేస్తున్నారని పలువురు అంటున్నారు. ఈ విషయమై ధరణి ఆపరేటర్ మాట్లాడుతూ తాను ఎవరి వద్ద డబ్బులు డిమాండ్ చేయలేదని, రిజిస్ట్రేషన్ పత్రాలు వచ్చి తీసుకెళ్లమని ఫోన్ చేసినా తీసుకెళ్లడం లేదని, తనను కావాలనే ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నాడు.

కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు

రైతు భూమి భాగాల పంపిణీకి ధరణి ఆపరేటర్ డబ్బులు డిమాండ్ చేశాడని రైతులు నాకు ఫిర్యాదు చేయడంతో అతన్ని పిలిచి హెచ్చరించాను. వారి పాసు పుస్తకం, రిజిస్ట్రేషన్ పత్రాలను వెంటనే ఇవ్వాలని చెప్పాను. అతను డబ్బులు డిమాండ్ చేయడానికి తహసీల్దార్ కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు.

– సాయిగౌడ్, తహసీల్దార్, కోదాడ

వైభవంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజలి సేవోత్సవం జరిపించారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూలకు సుప్రభాత సేవ, ఆరాధన, జోడుసేవలు తదితర నిత్యపూజలు ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.9,43,076 నిత్య ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

విద్యారంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం




సూర్యాపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని, నిరుద్యోగ అంశాన్ని పట్టించుకోలేదని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ అన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి స్పష్టమైన విధివిధానాలను తయారు చేయాలని పేర్కొన్నారు. లేదంటే ఈనెల 31న వేలాది మంది విద్యార్థులు, యువకులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, జిల్లా కోశాధికారి బండి రవి, వీరబోయిన లింగయ్య, దండి ప్రవీణ్, ఉపేందర్, వినోద్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

642 అడుగులకు మూసీ నీటిమట్టం

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా 15 రోజుల నుంచి మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం 790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 642.20 అడుగుల (3.74 టీఎంసీలు) వద్ద ఉంది. కాగా ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు మూసీ కుడి కాల్వకు 50 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



నీటిమట్టం సూచిక

క్లుప్తంగా

ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి

నల్లగొండ రూరల్ : విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంజీయూ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి శుక్రవారం తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సెంటర్ ఫర్ ఎక్సలెంట్‌ను స్థాపించామని పేర్కొన్నారు. రూ.30 లక్షల వ్యయంతో 25 కంప్యూటర్లు ఏర్పాటు చేసి 250 మంది విద్యార్థులకు ఉద్యోగ కల్పనపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇంజనీరింగ్, ఎంసీఏ విద్యార్థులకు మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే పలు సంస్థలతో ఎంఓయూ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రేఖ, హరీష్, జయంతి, సుధారాణి, సంధ్య, శ్రీనివాస్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

నడిగూడెం: మండల పరిధిలోని వల్లాపురంలో స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఉపేందర్ కిరాణ షాపులో రూ.3350 విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నామని ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

నల్లబెల్లం పట్టివేత

మద్దిరాల: అక్రమంగా నిల్వచేసిన నల్లబెల్లం, పట్టిక పట్టుకున్న సంఘటన మద్దిరాల మండల పరిధిలోని చిన్ననెమిలా ఆవాసం గుట్టకాడి తండాలో శుక్రవారం జరిగింది. సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్‌ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల పరిధిలోని చిన్ననెమిలా ఆవాసం గుట్టకాడి తండాకు చెందిన ధరావత్ నరేష్ అనే వ్యక్తి ప్రభుత్వం నిషేధించిన క్వింటాన్నర నల్లబెల్లం,10 కేజీల పట్టికను అక్రమంగా తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. వాటిని ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నాడు. ధరావత్ నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామంలో అమ్మగారింటికి వచ్చిన ఓ వివాహిత అదృశ్యమైంది. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు గ్రామానికి చెందిన దాడి కరుణాకర్‌రెడ్డి తన భార్య జయంతిని ఈ నెల 15వ తేదీన ఆమె అమ్మగారి ఇల్లు అయిన చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో వదిలి వెళ్లాడు. జయంతి ఈ నెల 19వ తేదీన కిరాణ దుకాణానికి వెళ్లేందుకు బయటకు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె భర్త కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

వెల్లంకిలో..



కట్ట మహేందర్

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కట్ట మహేందర్ (39) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ పి.మల్లయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన మహేందర్ 2024 మార్చి 20వ తేదీన రామన్నపేటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. గతంలోనూ ఇలాగే ఇంటి నుంచి వెళ్లి రెండు మూడు నెలల తరువాత తిరిగి వచ్చేవాడు. అతడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 8712662487 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాల కార్మికుడి గుర్తింపు

భువనగిరి క్రైం : పట్టణంలోని స్వీట్ దుకాణంలో బాల కార్మికుడిని అధికారులు గుర్తించారు. భువనగిరి బస్టాండ్ సమీపంలో శ్రీ బాలాజీ మిఠాయి బండార్‌లో బాలుడితో యజమాని పనులు చేయిస్తున్నాడు. అధికారులు తనిఖీలు చేసి బాలుడిని శుక్రవారం అక్కడ నుంచి సంరక్షణ కేంద్రానికి తరలించారు. దుకాణం యజమాని పంకజ్‌రామ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

అసోంలో ఆర్మీ జవాన్ మృతి

- తీవ్ర అస్వస్థతకు గురై కన్నుమూత
- మృతుడు నల్లగొండ జిల్లా అనుముల మండలం మదారిగూడెం వాసి
- 2022లో అగ్నిపథ్‌లో ఎంపికైన మహేష్



మృతిచెందిన జవాన్ ఈరేటి మహేష్(ఫైల్)

హాలియా : అసోం రాష్ట్రంలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని మదారిగూడెం గ్రామానికి చెందిన ఈరేటి మహేష్(24) మృతి చెందాడు. ఏడాదిన్నర కాలంగా అసోం రాష్ట్రంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్ ఈ నెల 9న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆయనను ఆర్మీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పది రోజులుగా చికిత్స పొందుతున్న మహేష్ గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మదారిగూడెం గ్రామానికి చెందిన ఈరేటి యాదయ్య–పార్వతమ్మ దంపతులకు ఈరేటి రమేష్, నరేష్, మహేష్ ముగ్గురు కుమారులు. కాగా పెద్ద కుమారుడు ఈరేటి రమేష్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు ఈరేటి నరేష్ 2019లో మిలటరీలో చేరి జమ్ము కశ్మీర్‌లోని మహర్ ప్రాంతంలో భద్రతాదళంలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడో సంతానమైన ఈరేటి మహేష్ 2022లో అగ్నిపథ్‌లో ఎంపికై ఆర్మీలో చేరాడు. ఏడాదిన్నర కాలంగా అసోం రాష్ట్రంలోని డిబీర్‌ఘట్ ప్రాంతంలో గన్నర్‌గా మహేష్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9న డిబీర్‌ఘట్ ప్రాంతంలోని మంచుకొండలో విధులు నిర్వహిస్తూ అక్కడ వాతావరణం అనుకూలించక మహేష్ తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురయ్యాడు. అధికారులు అతడిని చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక మిలటరీ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. వారం రోజులుగా చికిత్స అందించినా మహేష్ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఈ నెల 13న కుటుంబ సభ్యులకు అక్కడి సైనికాధికారులు సమాచారం అందించారు. మహేష్ పెద్దన్న రమేష్ తన తమ్ముడి బాగోగులు చూసుకోవడానికి అసోం వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జవాన్ ఈరేటి మహేష్ గురువారం రాత్రి మృతి చెందాడు.



రోదిస్తున్న తల్లి పార్వతమ్మను ఓదార్చుతున్న బంధువులు



ఈరేటి మహేష్(ఫైల్)

ఏదైనా సాధించాలనే లక్ష్యంతో..

ఈరేటి మహేష్ 2016లో హాలియా పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఆ తరువాత నల్లగొండలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, 2021లో ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ బీకాం పూర్తి చేశాడు. ఈరేటి మహేష్ ఎన్‌సీసీ కేడెట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. చిన్నప్పటి నుంచి మహేష్‌కు కబడ్డీ, బాక్సింగ్ ఆటలంటే మక్కువ. సమయం దొరికినప్పుడల్లా ఆటలపై ఆసక్తి కనబర్చేవాడు. భవిష్యత్‌లో ఏదైనా సాధించాలనే తపన మహేష్‌కు ఉండేది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో భాగంగా 2022లో సూర్యాపేటలో జరిగిన సెలక్షన్‌లో మహేష్ ఎంపికయ్యాడు. అసోం రాష్ట్రంలో ఇండియన్ ఆర్మీలో భద్రతా దళంలో చేరాడు. ఏడాదిన్నర కాలంగా అసోంలోని డిబీర్‌ఘట్ ప్రాంతంలోని సైనిక దళంలో గన్నర్‌గా మహేష్ విధులు నిర్వహిస్తున్నాడు.

అన్న స్ఫూర్తితో తమ్ముడు మహేష్..

మదారిగూడెం గ్రామానికి చెందిన ఈరేటి యాదయ్య–పార్వతమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా వారిలో పెద్దవాడైన రమేష్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా మిగిలిన ఇద్దరు కుమారులు నరేష్, మహేష్ ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తున్నారు. ఈరేటి నరేష్ 2019లో ఆర్మీలో చేరి ఐదేళ్లగా జమ్ము కశ్మీర్‌లోని మహర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. అన్నను స్ఫూర్తిగా తీసుకున్న తమ్ముడు ఈరేటి మహేష్ 2022లో ఆర్మీలో చేరాడు.

నేడు అంత్యక్రియలు

అసోం ప్రభుత్వం ప్రత్యేక హెలికాప్టర్‌లో మహేష్ భౌతికకాయాన్ని శుక్రవారం రాత్రి సికింద్రాబాద్‌కు తరలించి ఆ తరువాత ప్రత్యేక వాహనంలో స్వస్థలమైన మదారిగూడెం గ్రామానికి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దేశ సేవ చేయాలని ఆర్మీలో చేరిన ఈరేటి మహేష్ అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయాడనే వార్త తెలిసి మదారిగూడెం గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రతి ఒక్కరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించే మహేష్ ఇక లేడనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు.. మహేష్ ఇంటి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. తన కుమారుడి మరణ వార్త తట్టుకోలేని తల్లి పార్వతమ్మ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. శనివారం గ్రామంలో అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బీఆర్‌ఎస్.. బీజేపీలో విలీనమవుతుంది



దోనకల్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : బీఆర్‌ఎస్ పార్టీ.. త్వరలో బీజేపీలో విలీనమవుతుందన్న సమాచారం మా దగ్గర ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు లేదని.. బడ్జెట్‌లో కేంద్రం మొండిచేయి చూపిస్తే స్పందించని కేసీఆర్ అన్నివర్గాలు, రంగాలకు మేలు చేకూరే విధంగా తమ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. ఈ విషయాన్ని మెచ్చుకోకున్నా పర్వాలేదు గానీ.. ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా అనడంపై కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ను ఆరు నెలల్లోనే ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెండుసార్లు చీల్చి చెండాడారని.. ఇంక ఆయన ఏం చేస్తాడని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్రాలన్నీ గగ్గోలు పెడుతుంటే కేసీఆర్ ఏం మాట్లాడలేదంటే బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నాడన్నది వాస్తవమన్నారు. ఢిల్లీలో పార్టీ విలీనంపై చర్చలు జరుగుతున్నాయన్న సమాచారం ఉందన్నారు. పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు సమాన నిధులు ఇవ్వాలని.. కానీ, ఆంధ్రకు నిధులిచ్చి.. తెలంగాణకు మొండిచేయి చూపించినా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. చిన్న రాష్ట్రమైనా ఇంత పెద్దఎత్తున సంక్షేమం, అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. 30 సంవత్సరాల కాలంలో తానెప్పుడు ఇలాంటి బడ్జెట్ చూడలేదన్నారు. వ్యవసాయం, సాగునీటి రంగానికి రూ.70 వేల కోట్లకు పైగా నిధులు కోట్లు కేటాయించామన్నారు. దక్షిణ తెలంగాణలోని ఎస్‌ఎల్‌బీసీ, డిండి, బ్రాహ్మణవెల్లంల, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అమెరికా నుంచి కొత్త యంత్రాన్ని తెప్పిస్తామన్నారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోతుల దాడిలో విద్యార్థులకు గాయాలు

చివ్వెంల: కోతుల దాడిలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఉన్న పాఠశాలకు రోజుమాదిరిగానే విద్యార్థులు వెళ్లారు. ఈ క్రమంలో పాఠశాలలో చింతచెట్టుపై ఉన్న కోతులు ఒక్కసారిగా విద్యార్థుల మీదకు దూకి దాడి చేశాయి. ఈ దాడిలో కొంత మంది విద్యార్థులు పారిపోగా, మరికొందరు గాయపడ్డారు. గాయపడిన వారిలో 8వ తరగతి విద్యార్థిని గోగుల హాసిని, ఏడో తరగతి విద్యార్థి షేక్ బషీర్, ప్రాథమిక పాఠశాలకు చెందిన దొడ్డి రామ్ (2వ తరగతి), 3వ తరగతికి చెందిన కలకొండ రియ, గోగుల ప్రతిక్, 4వ తరగతికి చెందిన రావిచెట్టు అజ్ఞాసి, నవ్య, శక్షిత్, 5వ తరగతికి చెందిన నవిలే ఈశ్వర్ ప్రసాద్‌లు ఉన్నారు. ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యార్థులను ఆటోలో తరలించారు. వైద్యాధికారి భవాని విద్యార్థులకు చికిత్స అందించారు. విద్యార్థులపై కోతుల దాడి జరగడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కోతుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధుడిపై కోతుల దాడి

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఓ వృద్ధుడిపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలిమినేడు గ్రామానికి చెందిన కొండాపురం లింగయ్య(75) తన ఇంటి ఎదుట కూర్చుని ఉండగా అకస్మాత్తుగా గుంపులుగా వచ్చిన కోతులు మీద పడి దాడి చేశాయి. దీంతో లింగయ్య చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో కోతులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కోతుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

- సమయానికి ఆదుకున్న పోలీసులు

కొండమల్లేపల్లి : మండలంలోని ఆంగోతుతండాకు చెందిన ఆంగోతు నందు భర్తతో గొడవపడి క్షణికావేశంలో ఇంట్లో ఉరివేసుకుంది. తక్షణమే స్పందించిన భర్త శ్రీనునాయక్ వేలాడుతున్న తన భార్యను కిందకు దించి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తబాయి గేటు సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గమనించారు. పోలీసులు వెంటనే తమ వాహనంలో ఆంగోతు నందును దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దగ్గరుండి వైద్యం చేయించారు. నందు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి పేర్కొన్నారు. సమయానికి స్పందించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ మజీద్, రాములుకు నందు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న విద్యార్థుల అరెస్ట్

మేడ్చల్ రూరల్: జొమాటో బ్యాగులో గంజాయి తరలిస్తున్న విద్యార్థులను మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన విద్యార్థి సుతారి గుణశేఖర్(22), కొనిజెర్ల గ్రామానికి చెందిన విద్యార్థి చల్లమల్లి శరత్(23) శుక్రవారం మధ్యాహ్నం జొమాటో బ్యాగులో గంజాయి తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలుసుకున్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న 8.6 కేజీల ఎండు గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా నల్లగొండ జిల్లా బోయగూడకు చెందిన మరో విద్యార్థి అవిశెట్టి అభిరామ్(21), యాదాద్రి జిల్లా లింగోజిగూడకు చెందిన విద్యార్థి ఎర్ర ఆదిత్య (22)తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు నుంచి వాహనంలో 40 కిలోల గంజాయిని తీసుకువచ్చి కరీంనగర్ జిల్లా వేములవాడకు చెందిన కటకెల వినయ్(24) ఇంట్లో నిల్వ ఉంచారు. అతడు నిర్వహించే కబాబ్ సెంటర్ కేంద్రంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు వినయ్, ఆదిత్యలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4.4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 13 కేజీల గంజాయి విలువ రూ.13 లక్షలు ఉంటుందని తెలిపారు.



పట్టుబడిన విద్యార్థులు

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ), చింతపల్లి : హత్యాయత్నం కేసులో ముగ్గురు వ్యక్తులకు జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు జడ్జి రోజారమణి శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. 2014 ఆగస్టు 23వ తేదీన చింతపల్లి మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శిరసనగండ్ల యాదయ్య, శిరసనగండ్ల జగన్, ఎరుకల రమేష్ అనే ముగ్గురు వ్యక్తులు అదే గ్రామానికి చెందిన కాటపాక చంద్రయ్య అనే వ్యక్తిపై కర్రలు, రాళ్లతో దాడి చేసి హత్యాయత్నం చేయబోయారు. చంద్రయ్య కుమారుడు కాటిపాక ఇంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ ధనుంజయ్య కేసు నమోదు చేశారు. అప్పటి దేవరకొండ డీఎస్పీ చంద్రమోహన్, అనంతరం డీఎస్పీ మనోహర్ దర్యాప్తు చేపట్టారు. శ్రీవాణి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి శిక్షను ఖరారు చేశారు. శిరసనగండ్ల యాదయ్య, శిరసనగండ్ల జగన్‌కు పది సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా, ఎరుకలి రమేష్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్న సంఘటన శుక్రవారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారు దిలావర్‌పూర్ రోడ్డులో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం దుబ్బతండాకు చెందిన ధనావత్ నాగు అనే వ్యక్తి పట్టణంలోని ఏడుకోట్లతండా పరిసరాల్లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని దిలావర్‌పూర్ రోడ్డు వద్ద రూరల్ పోలీసులు అనుమానాస్పదంగా ఆటో కనిపించడంతో తనిఖీ చేయగా 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్ నాగును విచారించగా ఏడుకోట్లతండా పరిసరాల్లో తక్కువ ధరకు తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మేందుకు వెళ్తున్నట్లు అంగీకరించాడు. ఈ మేరకు పీడీఎస్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, ఆటో డ్రైవర్ నాగుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో మోటార్ తీసేందుకు వెళ్లి వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

కోదాడరూరల్ : బావిలో మోటారు తీసేందుకు వెళ్లి నీటమునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని గుడిబండలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కె.నాగరాజు(30) కూలి పనులు చేసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికంగా తెలిసిన ఓ రైతు వ్యవసాయ బావిలో ఉన్న మోటార్ బయటకు తీసేందుకు వెళ్లాడు. నీటి లోపల ఉన్న మోటార్‌కు తాడు కడుతున్న క్రమంలో ఊపిరాడక బావిలోపలే మృతి చెందాడు. నాగరాజు ఎంతకూ బయటకు రాకపోవడంతో ఒడ్డున ఉన్న రైతు స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు బావి వద్దకు చేరుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మోటార్ల సహాయంతో బావిలో నీటిని తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

నీటి గుంతలో పడి మేకల కాపరి దుర్మరణం


నూతనకల్: నీటి గుంతలో పడి మేకల కాపరి మృతి చెందిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టు విష్ణు(15) ఇటీవల పదో తరగతి పరీక్షల్లో తప్పాడు. దీంతో తండ్రి రమేష్ కుమారుడిని మేకలను మేపడానికి పంపిస్తున్నాడు. కాగా మేకలు కాస్తున్న క్రమంలో విష్ణుకు దాహం వేయడంతో గ్రామ శివారులోని కోమటికుంట వాగులోకి దిగాడు. నీరు తాగుతున్న సమయంలో అక్కడ మట్టి తవ్విన గుంతలు లోతుగా ఉండడంతోపాటు, మూర్ఛవ్యాధి ఉండడంతో మూర్ఛవచ్చి నీటిలో పడిపోయాడు. మేకలు ఇంటికి వచ్చినప్పటికీ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వాగు సమీపంలోకి వెళ్లి వెతికారు. ఒడ్డు పక్కన ఉన్న చెప్పులను చూసి నీటిలో మునిగి మృతి చెందినట్లు గుర్తించి నీటి గుంతలో వెతకగా విష్ణు అప్పటికే మృతి చెందాడు. విష్ణు మృతదేహాన్ని నీటి గుంతలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించామని, మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

- వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే



మాడ్గులపల్లి మండల పరిధిలోని బొమ్మకల్ శివారులోగల పొలంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం మహిళా కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. మరో రైతు పొలంలో ట్రాక్టర్‌తో దున్ని దమ్ము చేశారు.
– వేములపల్లి (మాడ్గులపల్లి)

శ్రీ వరి పద్ధతితో అధిక దిగుబడి



పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో ఉమ్మడి జిల్లాలో బావులు, బోర్లు, చెరువుల కింద రైతులు వరి సాగు పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే నారుమడులను పెంచుకుంటున్నారు. శ్రీ వరి పద్ధతిలో సాగు చేసుకుంటే అధిక దిగుబడి, లాభాలు పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు చెబుతున్నారు. శ్రీ వరి పద్ధతి గురించి ఆయన మాటల్లోనే..

సాధారణ పద్ధతిలో ఎకరాకు 20కిలోల విత్తనం

అవసరమైతే శ్రీ వరి పద్ధతిలో 2కిలోల విత్తనం సరిపోతుంది. ఈ పద్ధతిలో రసాయక ఎరువులు, పురుగు మందుల ఖర్చు చాలా తక్కువ. శ్రీ వరి పద్ధతిలో పైరు సహజంగా పెరుగుతుంది. వరి వేర్లు విస్తారంగా వ్యాప్తి చెంది, లోతుకు చొచ్చుకుపోయి, భూమి లోపల పొరల నుంచి పోషక పదార్థాలను తీసుకోగలుగుతాయి. శ్రీ వరి పద్ధతిలో పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కాబట్టి సాధారణంగా వరి పండించడానికి అవసరమయ్యే నీటిలో సగం నుంచి మూడో వంతు నీరు సరిపోతుంది.

❖ **లేత నారు నాటడం** : 8 నుంచి 12 రోజుల వయస్సు గల రెండు ఆకుల నారును మాత్రమే నాటాలి. దీని వలన అధిక సంఖ్యలో పిలకలు వచ్చి వేర్లు బాగా వ్యాపిస్తాయి.

❖ **జాగ్రత్తగా నాటడం** : నారుమడి నుంచి మొక్కను జాగ్రత్తగా వేరు, బురద గింజతో సహా తీసి పొలంలో పైపైన నొక్కి పెట్టాలి. లోతుగా నాటకూడదు. దీని వల్ల పీకేటప్పుడు సహజంగా ఉండే తీవ్రమైన ఒత్తిడికి మొక్క గురికాకుండా బతికి, త్వరగా పెరిగి అధిక సంఖ్యలో పిలకలు వేస్తుంది.



శ్రీ వరి పద్ధతిలో పెంచుతున్న నారు

❖ **దూరంగా నాటడం** : మొక్కల మధ్య 25 సెం.మీ. వరుసల మధ్య 25 సెంమీ. దూరం ఉండేటట్లు నాటాలి. భూసారం ఎక్కువగా ఉండే భూముల్లో ఇంకా దూరంగా నాటుకోవచ్చు.

❖ **కలుపు నివారణ** : పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూస్తాం కాబట్టి, కలుపు సమస్య ఎక్కువ. కలుపు నివారణకు కోనోవీడర్‌తో లేదా పవర్ వీడర్‌తో నాటిన 10 రోజులకు ఒకసారి, ఆ తర్వాత 10 రోజులకు ఒకసారి ఆ తర్వాత మరో 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు కలుపు తీయించాలి. ఇలా నేలను కదిలిస్తే, కలుపు మొక్కలు నేలలో కలిసిపోతాయి. ఈ విధంగా కలియబెట్టడం వల్ల ప్రతిసారి సుమారు హెక్టారుకు 1 టన్ను పచ్చిరొట్ట ఎరువు భూమికి చేరుతుంది. కోనోవీడర్ వాడకం వల్ల వేరుకు బాగా ఆక్సిజన్ అందుతుంది. దీంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది నత్రజనిని స్థిరీకరిస్తాయి. రెండుసార్ల కంటే ఎక్కువగా కోనోవీడర్ పనిచేసినప్పుడు ఒక్కోసారి హెక్టారుకు రెండు టన్నుల దిగుబడి వస్తుంది.

❖ **నీటి యాజమాన్యం** : నీటి యాజమాన్యం చాలా జాగ్రత్తగా చేపట్టాలి. పొలం తడిగా ఉండాలి అంతే గానీ నీరు నిల్వ ఉండకూడదు. నీరు ఎక్కువైతే బయటకు పోవడానికి వీలుగా ప్రతి 2 మీటర్లకు ఒక కాలువ ఏర్పాటు చేయాలి. మధ్యమధ్యలో పొలం ఆరితే నీరు పెడుతుండాలి. దాంతో వేర్లు ఆరోగ్యంగా వృద్ధి చెందుతాయి.

సేంద్రియ ఎరువులు : సేంద్రియ ఎరువులు బాగా వాడి భూసారం పెంచాలి. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు కూడా పైరుకు తొలిదశలో వాడవచ్చు. కానీ ముందు ముందు సేంద్రియ ఎరువులు వాడి, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి. శ్రీ వరి పద్ధతిలో 8 నుంచి 12 రోజుల నారు నాటడంతో వేర్లు బాగా వృద్ధి చెంది బలంగా ఉండి 30 నుంచి 50 పిలకలు వేస్తుంది. పిలకలు అన్ని ఒకేసారి పొట్ట దశకు చేరి, పెద్దపెద్ద కంకులు వేస్తాయి. కంకులలో గింజలు (400 వరకు) బాగా పాలు పోసుకుని ధృడంగా ఉంటాయి.

నారుమడి యాజమాన్యం : శ్రీ వరి పద్ధతిలో నారును 8–12 రోజుల దశల్లో నాటాలి. కాబట్టి నారు పెంచడంలో మెళకువలు పాటించాలి. 2 కిలోల విత్తనాన్ని ఒక సెంటు భూమిలో చల్లి నారు పెంచితే ఎకరాకు సరిపోతుంది. భూమిని మెత్తగా దున్ని, దమ్ము చేసి, ఎత్తుగా నారుమడి తయారుచేసి, చుట్టూ కాలువ తీయాలి. తడి మట్టి జారిపోకుండా మెత్తటి పశువుల ఎరువును ఒక పొరలాగా చల్లి, దానిమీద 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండె కట్టిన మొలకెత్తిన విత్తనాన్ని పలుచగా చల్లాలి. విత్తనాలపై మరలా పశువుల ఎరువు చల్లి గడ్డితో కప్పాలి. మొలక వచ్చిన వెంటనే గడ్డిని తీసివేయాలి. రోజూ నీరు చల్లుతూ ఉంటే 8 రోజులలో వరి నారు 2–3 ఆకులతో ధృడంగా పెరుగుతుంది. నారుమడి నుండి నారును పీకకుండా, మట్టితో సహా వరుసల మధ్య 25 సెం.మీ., మొక్కల మధ్య 25 సెం.మీ. దూరంలో మార్కర్ సహాయంతో నాటాలి.

ప్రధాన పొలం తయారీ : సాధారణ పద్ధతుల్లో వరి నాటేటప్పుడు భూమిని తయారు చేసినట్లుగానే శ్రీ వరి పద్ధతిలోనూ తయారు చేయాలి. అయితే ఈ పద్ధతిలో పొలం తడిగా ఉండాలి గానీ నీరు నిల్వ ఉండకూడదు. కాబట్టి నీరు పెట్టిన వెంటనే పోవడానికి ఏర్పాటు చేయాలి. పొలాన్ని బాగా చదును చేయాలి. దమ్ము చేసి, చదును చేసిన పొలంలో చేతితో లాగే రోలర్ మార్కర్‌తో నాలుగు గీతలు కలిసిన చోట వరి నారు మొక్కలను పైపైన గుచ్చాలి. ఏ మాత్రం నీరు నిలవ ఉన్నా బయటకు పోవడానికి వీలుగా ప్రతి 2 మీటర్లకు కాలు ఏర్పాటు చేసుకోవాలి.

పంట దిగుబడి : సాధారణ పద్ధతికన్నా అధికంగా పంట దిగుబడి వస్తుంది. పెట్టుబడి చాలా వరకు తగ్గుతుంది.